సాక్షి
పెద్దపల్లి
గురువారం । 25 । మే । 2023



పత్తి క్వింటాల్‌కు రూ.6,622

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌లో పత్తి క్వింటాల్‌కు రూ.6,622 పలికింది. కనిష్టంగా రూ.5,511, మోడల్‌కు రూ.6,485గా నిర్ణయించారు.



మోడల్ స్కూల్లో చేరండి

కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలకు దీటుగా మోడల్ స్కూల్ పాఠశాలలు, కళాశాలలు విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తున్నారు.

8లో▸

గరిష్టం/కనిష్టం
43.8/30.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోత విపరీతంగా పెరుగుతుంది.

న్యూస్‌రీల్

జూన్ 6 వరకు 'భద్రాచలం' రైలు రద్దు



భద్రాచలంరోడ్ రైల్వేస్టేషన్

రామగుండం: వరంగల్ – డోర్నకల్ రైల్వేస్టేషన్ల మధ్య రైల్వే ట్రాక్ పునరుద్ధరణ పనుల నేపథ్యంలో సిర్‌పూర్‌కాగజ్‌నగర్–భద్రాచలం రోడ్ (రైలునంబర్ 17034) మధ్య నడిచే సింగరేణి ఫాస్ట్ ప్యాసింజర్ రైలు జూన్ 6 వరకు రాకపోకలను రద్దు చేశారు. కేవలం వరంగల్ వరకు మాత్రమే నడిపించనున్నట్లు రైల్వే ఉన్నతాధికారులు పేర్కొన్నారు. సింగరేణి రైలు వరంగల్–కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్ల మధ్య మాత్రమే నడుస్తుందని, కోల్‌బెల్ట్ ప్రయాణికులు సహకరించాలని సూచించారు.

ఆర్‌ఎఫ్‌సీఎల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న కృష్ణ

జ్యోతినగర్: రామగుండం ఎరువుల కర్మాగారంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కాంట్రాక్టు కార్మికుల సంఘం (ఐఎఫ్‌టీయూ) జిల్లా అధ్యక్షుడు ఐ.కృష్ణ ఎన్టీపీసీ టీటీఎస్‌లోని కార్మిక శాఖ అధికారిని బుధవారం కలిసి వినతిపత్రం అందించారు. ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో వెయ్యి మందికి పైగా కార్మికులు వివిధ కేటగిరీల్లో పనిచేస్తున్నారని, వారికి చట్టబద్ధ హక్కులను యాజమాన్యం కల్పించలేదని ఆరోపించారు. యాజమాన్యంతో చర్చించడానికి ప్రయత్నించినా సహకరించడం లేదన్నారు. కార్మికుల 14 డిమాండ్లపై యాజమాన్యానికి నోటీస్ ఇచ్చినా స్పందన లేదన్నారు. యాజమాన్యం స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి నరేష్, బ్రాంచి నాయకులు తిప్పని రామ్‌కీ, కుమారస్వామి, శ్రీధర్, చింతల ప్రవీణ్, రమేశ్ పాల్గొన్నారు.

అప్రమత్తతతో ప్రమాదాల నివారణ



ప్రదర్శన ఇస్తున్న సీఐఎస్‌ఎఫ్ బృందం

జ్యోతినగర్: అప్రమత్తతో అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు చీఫ్ జనరల్ మేనేజర్ ప్రసేంజిత్ పాల్ అన్నారు. పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని బాలికా సాధికారత శిక్షణ శిబిరాన్ని బుధవారం సందర్శించారు. ప్రభుత్వ పాఠశాలల బాలికలకు నెలరోజుల శిక్షణ వారి భవిష్యత్‌కు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. శిక్షణలో వారు నేర్చుకుంటున్న అంశాలను తెలుసుకున్నారు. సీఐఎస్‌ఎఫ్ బృందం అగ్నిప్రమాదాల నివారణ చర్యలను ప్రదర్శన ద్వారా వివరించారు. ఫైర్ ఇన్స్‌పెక్టర్ సుబ్రతఘోష్, సబ్ ఇన్స్‌పెక్టర్ జోగేందర్ సింగ్, రాజీవ్ కుమార్, కేఎల్.రెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.

టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం



అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెద్దపల్లిరూరల్: జిల్లాను రెండేళ్లలో టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుదామని జిల్లా టీబీ ప్రోగ్రాం అధికారి సుధాకర్‌రెడ్డి అన్నారు. జిల్లాలోని పీహెచ్‌సీలు, వెల్‌నెస్ సెంటర్లలో బుధవారం నిక్షయ్ నివాస్ సందర్భంగా అవగాహన కల్పించారు. రెండు వారాలకు మించి తెమడ, దగ్గు, రాత్రిపూట జ్వరం, బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే అందుబాటులో ఉన్న ప్రభుత్వాసుపత్రుల్లో పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ జరిగితే ప్రభుత్వం ఉచితంగా వైద్యం అందించడంతోపాటు మందులను కూడా సరఫరా చేస్తుందన్నారు. డీఆర్‌టీబీ డాక్టర్ సంపత్, టీబీ యూనిట్ పర్యవేక్షకుడు తిరుపతి, ల్యాబ్ సిబ్బంది జీనత్‌సహబ్రీ, శ్రావణి, జయలక్ష్మి తదితరులున్నారు.

'వాల్టా'కు తూట్లు

- జిల్లావ్యాప్తంగా ఇష్టారీతిన బోర్లు
- అనుమతులు ఉండవు.. నిబంధనలు పాటించరు
- భూగర్భజలాలపై ప్రజల్లో ఆందోళన
- మేల్కోకుంటే భవిష్యత్తులో ముప్పే

భూగర్భజలమట్టం (మీటర్లలో)

గతేడాది మార్చిలో	7.89
ఈఏడాది మార్చిలో	7.40
గతేడాది ఏప్రిల్‌లో	8.16
ఈఏడాది ఏప్రిల్‌లో	7.64

"ఇటీవల పెద్దపల్లి మున్సిపాలిటీ పరిధిలో జోరుగా భవన నిర్మాణాలు జరుగుతున్న ఓ వార్డులో తమ బోరు పక్కనే.. కనీసం 10 మీటర్ల దూరం కూడా లేకుండా బోరు వేస్తున్నాదని ఇరువురు ఇంటి యజమానులు గొడవపడ్డారు..

మంథనికి చెందిన ఓ రైతు తాను పొలంలో వేసిన బోరు పక్కనే మరో రైతు మొదటి బోరును మించి మరో 50 మీటర్లు లోతులో మరోబోరు వేశాడని సదరు రైతుతో గొడవకు దిగాడు. ఈ గొడవకాస్త అధికారులకు ఫిర్యాదు చేసేవరకూ వెళ్లింది."



మంథనిలో బోరుబావుల కోసం డ్రిల్లింగ్

సాక్షి, పెద్దపల్లి: జిల్లాలో వాల్టా చట్టానికి తూట్లు పడుతున్నాయి. వేసవి మొదలైదంటే చాలు పొలాల్లో ఇష్టారీతిన బోరుబావులు తవ్వుతున్నారు. ఈ పరిస్థితి ఏటా పెరుగుతూనే ఉంది. అనుమతి లేకుండా, నిబంధనలు పాటించకుండా ఇష్టంవచ్చినట్లు బోర్లు వేస్తుండడంతో భూగర్భ జలాలు భారీగా పడిపోతున్నాయి. మరికొన్నిచోట్ల బోర్లు ఫెయిలై రైతులకు అప్పులు మిగుల్చుతున్నాయి. బోరు తవ్వే సమయంలో అక్కడ నీరు పడుతుందా..? లేదా..? అని కనీస పరీక్ష చేయించకోకపోవడంతో నీరు పడక అప్పుల పాలవుతున్నారు. బోర్‌వెల్ నిర్వాహకులు కూడా కాసులకు ఆశపడి ఎక్కడపడితే అక్కడ బోర్లు వేస్తున్నారు. నీటి పొదుపును పాటిస్తున్నాం.. నీటి ఎద్దడి రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నాం.. వాల్టా చట్టాన్ని పక్కాగా అమలు చేస్తున్నాం.. అని పాలకులు, అధికారులు ప్రచారం చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం వారి ప్రభావం కనిపించటం లేదు.

అడ్డగోలుగా తవ్వకాలు

అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలో దాదాపు 8వేల నుంచి 10 వేల వరకు బోరుబావులు ఉన్నాయి. వీటి సంఖ్య ఏటా 10 శాతం పెరుగుతోంది. వాల్టా చట్టం–2002 బోర్ల మధ్య ఎంత దూరం ఉండాలనేది తెలుపుతుంది. ఇది ఆయకట్టు, నాన్ ఆయకట్టు, నది పరీవాహక ప్రాంతాలు, పరీవాహకేతర ప్రాంతాలకు వేర్వేరుగా ఉంటుంది. ప్రస్తుతం వేస్తున్న బోర్ల విషయంలో ఒక్కో బోరుబావికి మధ్య ఆయకట్టుకాని ప్రాంతాల్లో.. నది పరీవాహకేతర ప్రాంతాల్లో 300 మీటర్ల నుంచి 500 మీటర్ల వరకు, ఆయకట్టు ప్రాంతాల్లో, నది పరీవాహక ప్రాంతాల్లో 200 మీటర్ల నుంచి 300 మీటర్ల దూరంలో బోర్లు ఉండాలి. జిల్లాలో ఇలాంటి పరిస్థితి ఎక్కడా కనిపించటం లేదు. కేవలం పదుల మీటర్ల వ్యవధిలోనే బోర్లు వేస్తూ భూగర్భ నీటిపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు.

అనుమతి కోసం ఏంచేయాలంటే..?

బోర్ల అనుమతికి ముందుగా తహసీల్దార్‌కు రైతు దరఖాస్తు చేసుకోవాలి. ఆ దరఖాస్తును భూగర్భ జలవనరుల శాఖ అధికారులకు సర్వే నిమిత్తం పంపిస్తారు. వీరు ఆ రైతు భూమిలో నీరు ఉందా..? లేదా..? అనేది నిర్ధారించడంతోపాటు సమీపంలో బోరు లేదని చెప్పిన తర్వాతే బోరు వేయాలి. బోర్లు వేసేవారు భూగర్భ జలవనరుల శాఖ నుంచి అనుమతి పత్రాలు అందాకే బోర్ వేయాలి. ఇది వాల్టా చట్టం చెబుతోంది.

పొంచి ఉన్న ముప్పు..

మంథనిలోని నాగేపల్లి, స్వర్ణపల్లి, వెంకటాపూర్, ఎక్లాస్‌పూర్ గ్రామాల్లో సామర్థ్యానికి మించి నీరు వినియోగిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో బోర్ల తవ్వకాలపై నిషేధం ఉన్నా యథేచ్ఛగా వేస్తున్నారు. 2019–20 భూగర్భ జల వనరుల శాఖ వెల్లడించిన నివేదిక ప్రకారం అత్యధికంగా కాల్వశ్రీరాంపూర్‌లో 79శాతం, మంథనిలో 61శాతం, ముత్తారంలో 60 శాతం భూగర్భజలాలను వినియోగిస్తున్నారు. అతితక్కువగా రామగుండంలో 14శాతం, రామగిరిలో 30శాతం నీటివనరులను వినియోగిస్తున్నారు. ఎక్కువగా నీటి ఆధారిత పండించే పంటలు సాగు చేస్తుండటం, ఉచిత విద్యుత్ కారణంగా బోర్ల సంఖ్య పెరుగుతోంది. విచ్చలవిడి బోర్ల తవ్వకాల పై భూగర్భజలశాఖ అధికారుల వివరణ కోరగా బోరు బావుల తవ్వకోవడానికి మీసేవ లేదా టీఎస్ఐపాస్‌లో దరఖాస్తు చేసుకుని అనుమతి తీసుకోవాలని, అనుమతి లేకుండా బోర్లు వేయటం వాల్టా చట్టం ప్రకారం విరుద్ధమని అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

భగ్గుమన్న భానుడు

- రాష్ట్రంలోనే జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు
- ఉదయం 7గంటల నుంచే తీవత్ర షురూ
- వేడిగాలులు, ఉక్కపోతతో జనం విలవిల

జిల్లాలో నమోదైన ఉష్ణోగ్రతలు (డిగ్రీల్లో)

రంగంపల్లి	45.1
రామగుండం	45.1
కమాన్‌పూర్	44.5
శ్రీరాంపూర్	44.5
ఓదెల	44.5
మల్యాలపల్లి	44.4
అకినేపల్లి	44.2
ఈసాలతక్కళ్లపల్లి	44.1
పాలితం	44.0



సాక్షి, పెద్దపల్లి: జిల్లాలో భానుడు బుధవారం భగభగలతో సెగలు కక్కాడు. రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు జిల్లాలో నమోదయ్యాయి. చాలాప్రాంతాల్లో 44 డిగ్రీలు దాటింది. పెద్దపల్లి, రామగుండంలో ఉష్ణోగ్రత 45డిగ్రీలు దాటడంతో జనం అల్లాడిపోయారు. ఎండ దంచికొట్టడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అత్యధిక ఉష్ణోగత్రలు జిల్లాలో నమోదవుతుండటంతో బయటకు రావడానికి ప్రజలు భయపడుతున్నారు. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటలు దాటినా వేడిగాలులు తగ్గలేదు. కొన్ని రోజులుగా ఉదయం నుంచే రోడ్లన్నీ నిర్మానుష్యంగా ఉంటున్నాయి. ఎండలో ప్రయాణాలు చేస్తున్న వారి పాట్లు అన్నీఇన్నీ కావు. ఉపాధి హామీ పథకం, వ్యవసాయం, భవన నిర్మాణాలు తదితర పనులకు వెళ్లిన కూలీలు ఎండధాటికి తట్టుకోలేక విలవిలలాడుతున్నారు. వ్యాపారులు కూడా మధ్యాహ్నం ఇళ్లకు వెళ్లి సేద తీరుతున్నారు. చిరు వ్యాపారులు ఉదయమే వ్యాపారాన్ని ముగించుకుని ఇళ్లకు చేరుతున్నారు.

కూలర్లు, ఏసీలు, ఫ్యాన్ల మోత

ఎండ తీవ్రత పెరగటంతో ఇళ్లల్లో కూలర్లు, ఏసీలు, ఫ్యాన్ల మోత మోగుతోంది. ఇప్పటికే ఏప్రిల్ నెలకు సంబంధించి విద్యుత్ వాడకం గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం రేయింబవళ్లు ఏసీలు, కూలర్లు తిరుగుతుండడంతో బిల్లులు రెట్టింపయ్యే అవకాశం ఉందని, ఎండ నుంచి ఉపశమనం పొందాలంటే తప్పదు కదా పలువురు వినియోగదారులు చెబుతున్నారు.

ధాన్యం కొనడంలో జాప్యమెందుకు..?

- మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి
- రాఘువాపూర్ వద్ద రైతుల రాస్తారోకో



పెద్దపల్లి-మంథని రోడ్డుపై రైతులతో కలిసి బైఠాయించిన మాజీ ఎమ్మెల్యే గుజ్జుల

పెద్దపల్లిరూరల్: రైతులు తాము పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు అమ్ముకుందామని కొనుగోలు కేంద్రాలకు తెస్తే జాప్యం చేస్తున్నారని, రైతులను ఎందుకు గోస పెడుతున్నారని మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి ప్రశ్నించారు. పెద్దపల్లి మండలం రాఘువాపూర్ వద్ద రైతులు మాజీ ఎంపీటీసీ పర్వతాలు, మాజీ సర్పంచులు ప్రభాకర్‌రెడ్డి, కుమారస్వామితో కలిసి రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. వారికి మద్దతుగా గుజ్జుల రాస్తారోకోలో పాల్గొన్నారు. రైతు సంక్షేమం కోసం పాటుపడుతున్నామని గొప్పలు చెప్పుకుంటున్న పాలకులు అన్నదాతలను అరిగోస పెడుతున్నారని ఆరోపించారు. పెద్దపల్లి, బసంత్‌నగర్ ఎస్సైలు మహేందర్, వెంకటేశ్ విషయాన్ని ఉన్నతాధికారులకు చేరవేశారు. జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వెంకటేశ్, ఆర్డీఓ వెంకటమాధవరావు వచ్చి కొనుగోళ్లు త్వరితగతిన జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. కేంద్రాన్ని సందర్శించి వెంటవెంటనే తూకం వేయాల్సిందిగా ఆదేశించారు. రవాణాకు అవసరమైన లారీలను సమకూర్చాలన్నా. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, సీపీఎం నాయకులు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది వేడుకలు ఘనంగా నిర్వహిద్దాం

- పథకాలు వివరించే ఫ్లెక్సీలు ఊరూరా ఏర్పాటు
- జూన్ రెండు నుంచి 22వరకు ఉత్సవాల నిర్వహణ
- కలెక్టర్ సంగీత వెల్లడి



వేడుకలపై సమీక్షిస్తున్న కలెక్టర్, అడిషనల్ కలెక్టర్

పెద్దపల్లిరూరల్: రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సాధించిన ప్రగతిని వివరించేలా దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ సంగీత తెలిపారు. జూన్ రెండో తేదీ నుంచి 22 వరకు నిర్వహించే రాష్ట్ర అవతరన వేడుకలపై బుధవారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ప్రభుత్వ శాఖల వారీగా జరిగిన ప్రగతి, ప్రజలకు అందిన పథకాల ఫలాల వివరాలు ఇవ్వాలన్నారు. 2014 కంటే ముందున్న పరిస్థితులు, ఆ తర్వాత జరిగిన ప్రగతి వివరాలను పోల్చి చూపాలని సూచించారు. రోజుకో అంశం చొప్పున కార్యక్రమాలు చేపట్టాలని, గ్రామాలవారీగా ప్రగతిపనులు, లబ్ధిదారుల వివరాలతో కూడిన ఫ్లెక్సీలను ఊరూరా ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ కుమార్‌దీపక్, జిల్లా అధికారులున్నారు.

మిల్లుల వద్ద సమస్యల్లేకుండా చూడాలి..

జిల్లాలో రైతులు పండించిన ధాన్యం కొనుగోలు, రవాణా ప్రక్రియ సజావుగా సాగేలా చూడాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్, చైర్మన్ రవీందర్‌సింగ్ సూచించారు. కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. రైతులు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వం మద్దతు ధరకు కొంటుందని, రైస్‌మిల్లుల వద్ద స్థల సమస్య కారణంగా అన్‌లోడింగ్ ఆలస్యమైతే ఇతర గోదాముల్లో భద్రపర్చేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు లక్షా80వేల మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని కలెక్టర్ సంగీత తెలిపారు. మిల్లులకు అలాట్ చేసిన ధాన్యాన్ని దిగుమతి చేసుకునేలా ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. కొనుగోలు కేంద్రాలు, మిల్లుల వద్ద రైతులకు ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. డీఎస్‌ఓ వెంకటేశ్, డీఆర్‌డీఓ శ్రీధర్, డీఏఓ ఆదిరెడ్డి, డీఎస్‌ఓ మైఖేల్‌బోస్ తదితరులున్నారు.



ఘనంగా పోచమ్మ బోనాలు

కమాన్‌పూర్: మండలకేంద్రంలో పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. బుధవారం మహిళలు బోనాలతో అమ్మవారి ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లారు. మండలకేంద్రంతో పాటు పిల్లిపల్లె, బాపూజీనగర్, కిష్టంపల్లెకు చెందిన మహిళలు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, బీజేపీ నాయకులు చందుపట్ల సునీల్‌రెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుల చర్చలు వాయిదా



చర్చల్లో పాల్గొన్న కార్మిక సంఘాల ప్రతినిధులు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం కాంట్రాక్టు కార్మికుల వేతన ఒప్పందంపై హైదరాబాద్‌లో జరిగిన చర్చలు మరోసారి వాయిదాపడ్డాయి. బుధవారం రీజినల్ లేబర్ కమిషనర్ (ఆర్‌ఎల్‌సీ) సునిల్ కుమార్ సాహూ సమక్షంలో ఎన్టీపీసీ యాజమాన్యం ప్రతినిధులు శామ్యూల్ ప్రశాంత్, దీపక్‌కుమార్ పాఠక్, కాంట్రాక్టర్లు ఏబీసీ రెడ్డి, ఎలిని నారాయణ, దాడి శ్రీనివాస్, రాజేశం, కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులు చిలుక శంకర్, భూమల్ల చందర్, ఎం.శంకర్, ఇజ్జగిరి భూమయ్య, రాధారపు రాజమల్లయ్య, చింతల సత్యం సమావేశమయ్యారు. ప్రస్తుతం ఉన్న అదనపు భత్యం కంటే రూ.2,900 పెంచాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. యాజమాన్యం మాత్రం కేవలం రూ.400 ఇస్తామని ప్రకటించింది. దానికి ఒప్పుకోకపోవడంతో సమయం కావాలని కోరగా.. చర్చలను జూన్ 23కు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు స్వాగతం



పెద్దపల్లిరూరల్: మంచిర్యాల జిల్లాకు వెళ్తున్న రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు పెద్దపల్లిలోని కూనారం క్రాస్‌రోడ్‌వద్ద స్థానిక ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, జెడ్పీటీసీ బండారి రామ్మూర్తి, శ్రీనివాస్ స్వాగతం పలికారు. మంత్రిని కలిసి శాలువా, పూలమాలతో సత్కరించారు. ఉద్యోగ సంఘనాయకులు కూడా మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

తప్పుల తడకగా 'ధరణి'



భోజన్నపేటలో ధరణి పోర్టల్‌పై అవగాహన కల్పిస్తున్న సాదిక్‌అలీ

పెద్దపల్లిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన 'ధరణి' పోర్టల్ తప్పులతడకగా మారిందని, కబ్జాలో ఒకరి పేరు ఉంటే పట్టా మరొకరి పేరిట ఉందని సామాజికవేత్త, హైకోర్టు న్యాయవాది సాదిక్‌అలీ అన్నారు. పెద్దపల్లి మండలం చీకురాయి, భోజన్నపేటలో బుధవారం సాదిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ధరణి పోర్టల్‌పై సర్వే నిర్వహించి సమస్యలపై ఆరా తీశారు. ధరణి పోర్టల్‌లో కబ్జా కాలం లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వారసత్వ భూములు కూడా పట్టా కావడం లేదన్నారు. సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

ముగిసిన సీఎం కప్ జిల్లాస్థాయి పోటీలు



బహుమతులు అందిస్తున్న జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, కలెక్టర్ సంగీత, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి

- హాజరైన జెడ్పీ చైర్మన్ పుట్ట మధు
- విజేతలకు బహుమతులు ప్రదానం
- రాష్ట్రస్థాయిలో రాణించాలని ఆకాంక్ష

గోదావరిఖని: జిల్లాలోని గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో మూడు రోజులుగా నిర్వహించిన సీఎంకప్ జిల్లాస్థాయి పోటీలు బుధవారంతో ముగిశాయి. కార్యక్రమానికి హాజరైన జెడ్పీ చైర్మన్ పుట్ట మధు మాట్లాడుతూ.. జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలన్నారు. సీఎం కేసీఆర్ చరిత్రలో నిలిచే కార్యక్రమాలు అమలు చేస్తున్నారని, అందుకే ప్రతి గ్రామంలో తెలంగాణ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువక్రీడాకారుల్లో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. జిల్లాస్థాయి పోటీల్లో 900మందికి పైగా 11 రకాల పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. జూన్ 2 నుంచి 21 రోజులపాటు నిర్వహించే దశాబ్ది వేడుకలలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కలెక్టర్ సంగీత, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డితో కలిసి విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుమార్ దీపక్, మేయర్ అనిల్‌కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్, పెద్దపల్లి ఆర్డీవో వెంకట మాధవ్‌రావు, సుమన్‌రావు, పాలకుర్తి జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి ఉన్నారు.

కుల వృత్తులపై యాంత్రీకరణ దెబ్బ

- కనుమరుగైన కమ్మరి వృత్తి
- గ్రామాల్లో కళ కోల్పోయిన వడ్రంగి
- ఉపాధి లేక దిక్కులు చూస్తున్న కుల వృత్తిదారులు
- గ్రామాల్లో పనిలేక పట్టణాలకు వలస


అబ్బాపూర్‌లో పని లేక మూలనపడిన కమ్మరికొలిమి


అబ్బాపూర్‌లో కర్రను చెక్కుతున్న వడ్రంగి

జూలపల్లి(పెద్దపల్లి): తెలంగాణలో వ్యవసాయం వేగంగా యాంత్రీకరణ వైపు దూసుకెళ్తోంది. దుక్కి దున్నుడు నుంచి కోత వరకు యంత్రాలను వినియోగిస్తుండడంతో వ్యవసాయానికి పనిముట్లు తయారు చేసిచ్చే వృత్తి దారులు పనులు లేక కుటుంబాలను పోషించేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. చేతిలో పని లేక పట్టణాలకు వలస వెళ్లక తప్పడం లేదు. ఒకప్పుడు ఉదయమే రైతులతో కళకళలాడే వడ్రంగి, కమ్మరి కుటుంబాల ఇళ్లు ప్రస్తుతం పని చేయించుకునేందుకు వచ్చే వారు లేక వస్తులుండాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వ్యవసాయానికి వడ్రంగులు చేసే పనులు

గతంలో వడ్రంగి వృత్తిదారులు సాగుకు పలు పనిముట్లు చేసిచ్చేవారు. నాగళ్లు, పాలె, జంబు, గొర్రు, పారకు, గొడ్డలికి కామలు వేసేవారు. ప్రస్తుతం ప్లాస్టిక్ వస్తువులు వచ్చాయి. ఎడ్ల బండ్లకు గీరెలతో పాటు బల్ల, నొగలు, రాకెలు, ఖాని తయారు చేసేవారు. గ్రామాల్లో ఇళ్లను కట్టెతో కట్టే వారు. కిటికీలు, తలుపులు తయారు చేసేవారు. ప్రస్తుతం అన్నీ రెడీమేడ్‌గా దొరుకుతుండడంతో వీటి వైపు వినియోగదారులు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం యాంత్రీకరణతో వీటిలో ఒక్క పని కూడా వడ్రంగి చేయడం లేదు.

కమ్మరి వృత్తి కనుమరుగు..

గ్రామాల్లో కమ్మరి వృత్తికి మంచి గుర్తింపు ఉండేది. వ్యవసాయదారుల నుంచి కూలీల వరకు కమ్మరి వద్దకు వెళ్లనిదే పని సాగేది కాదు. నాగలికి కర్రులు వేస్తేనే దున్నేందుకు అవకాశం ఉండేది. పారలు, గొడ్డళ్లు, కొడవళ్లు, కురిపేలు, ఎండ్ల బండ్లకు కమ్ములు వేయడం వీరి పనే. వీరు ఈ పనులు చేస్తేనే వ్యవసాయం ముందుకు సాగేది. అలాంటి కమ్మరి వృత్తి యాంత్రీకరణతో గ్రామాలలో పూర్తి కనుమరుగైంది. ఈ రెండు వృత్తులపై ఆధారపడిన కుటుంబాలు జిల్లా వ్యాప్తంగా దాదాపు 800–900 వరకు ఉన్నట్లు కుల సంఘాల నాయకులు పేర్కొన్నారు. ప్రస్తుతం వీరు వ్యవసాయ కూలీలుగా, మరికొందరు పట్టణాలకు వలస వెళ్లి కూలీ పనులు చేసుకుంటున్నారు. ప్రభుత్వం కొన్ని రకాల కుల వృత్తులనే గుర్తించి పథకాలు అమలు చేస్తుండడంతో రైతులపై ఆధారపడి కుల వృత్తినే నమ్ముకుని జీవించిన వడ్రంగి, కమ్మరులు ప్రభుత్వ గుర్తింపునకు నోచుకోకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

ప్రభుత్వం ఆదుకోవాలి



వ్యవసాయ పనిముట్లు తయారు చేసిన వడ్రంగి, కమ్మరి కుటుంబాలు ఉపాధి కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. గతం నుంచి భూములు లేక పేదరికంలో బతికిన కుటుంబాలు కావడంతో కూలీకి వెళ్తున్నారు. ఇతర కులవృత్తులను గుర్తించి పథకాలు ఇస్తున్నట్లే వీరికి కూడా ప్రభుత్వం పథకాలు అమలు చేయాలి.

– బీమోజు సురేందర్, జిల్లా విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం బాధ్యులు

50 ఏళ్లకే ఆసరా ఇవ్వాలి



పేదరికంతో కొట్టుమిట్టాడుతున్న కమ్మరి, వడ్రంగి కులవృత్తి దారులకు 50 ఏళ్లకే ఆసరా పింఛన్లు ఇవ్వాలి. ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా పూర్తి సబ్సిడీతో రుణాలు ఇప్పించి ఆదుకోవాలి. కుల వృత్తి నడవక గ్రామాలను విడిచి ఇప్పటికే చాలా కుటుంబాలవారు పట్టణాలకు వలస వెళ్లారు.

– బీమోజు రాజేందర్, మండల విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం బాధ్యులు

కూలీ పనికి వెళ్తున్న..



రైతులకు అవసరమైన వ్యవసాయ పనిముట్లు తయారు చేసిన. ప్రస్తుతం ట్రాక్టర్లు పెట్టి దున్నిస్తుండడంతో ఎవరూ రావడం లేదు. ఒకప్పుడు మా కుటుంబానికి వంద పై చిలుకు రైతుల పొత్తు ఉండేవి. నాగళ్లు, జంబులు, దున్నుడు, ఎండ్ల బండ్లు లేక ఇప్పుడు పని చేయించుకునేవారు లేరు. మమ్మల్ని ప్రభుత్వం ఆదుకోవాలి.

– శ్రీరాములు మల్లేశం, వడ్రంగి, అబ్బాపూర్

క్లుప్తంగా

మేడిపల్లి ఓసీపీని సందర్శించిన డైరెక్టర్


మాట్లాడుతున్న డైరెక్టర్ శ్రీనివాస్

గోదావరిఖని: మేడిపల్లి ఓసీపీని సింగరేణి డైరెక్టర్ ఎన్‌వీకే.శ్రీనివాస్ బుధవారం సందర్శించారు. ఓవర్ బర్డెన్ బెంచ్, పీటీపీ ప్లాంట్, ఎంసెండ్ ప్లాంట్, సీఏలాండ్ పరిశీలించారు. కొత్తగూడెం వీకేఓసీపీ విస్తరణకు పర్యావరణ అనుమతుల నిమిత్తం మేడిపల్లి ఓసీపీ ఏరియాకు చెందిన భూమి ఇచ్చే సాధ్యాసాధ్యాలను తెలుసుకున్నారు. సింగరేణి స్వాధీన పర్చుకున్న భూములు అన్యాక్రాంతం అయ్యాయా..? క్రమబద్ధీకరణలో ఉన్నాయా..? అనే అంశాలపై ఆరాతీశారు. జీఎంలు సుభానీ, చింతల శ్రీనివాస్, సైదులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ కృషితో పెరిగిన అలవెన్స్‌లు


మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి కార్మికులకు 19శాతం ఎంజీబీ, 25 శాతం అలవెన్స్‌లు సాధించడంలో ఏఐటీయూసీ కృషిని కార్మికులు గుర్తించాలని సంఘం జనరల్ సెక్రెటరీ వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. బుధవారం రాత్రి ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుతో సింగరేణి సంస్థ భవిష్యత్ ప్రశ్నార్థకరంగా మారిందని రాష్ట్రం నుంచి రావాల్సిన బకాయిలు చెల్లించక పోవడంతో సంస్థకు ఆర్థికంగా బారం పెరిగిందన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాడేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కొరివి రాజ్‌కుమార్, ఆర్జీ–2 బ్రాంచ్ కార్యదర్శి రాజరత్నం శాంసన్, తిరుపతి, సాంబశివరావు, రవికుమార్ పాల్గొన్నారు.

ఇద్దరికి కారుణ్య నియామక పత్రాల అందజేత


నియామక పత్రాలు అందిస్తున్న జీఎం

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–2 పరిధిలో మెడికల్ అన్‌ఫిట్‌లో దిగిపోయిన కార్మికుల పిల్లలకు బుధవారం కారుణ్య నియామకపత్రాలను అందజేశారు. జీఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఇద్దరికి జీఎం మనోహర్ పత్రాలను అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్, అధికార ప్రతినిధి రాజేంద్రప్రసాద్, పర్యావరణ అధికారి సురేష్ పాల్గొన్నారు.

కార్మికులను అయోమయానికి గురిచేస్తున్న హెచ్‌ఎంఎస్


మాట్లాడుతున్న రాజారెడ్డి

గోదావరిఖని: కార్మికులను అయోమయానికి గురిచేస్తున్న చరిత్ర హెచ్‌ఎంఎస్ నేత రియాజ్‌కు ఉందని సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి విమర్శించారు. బుధవారం జీడీకే–1,3 గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. ప్రతి వేతన ఒప్పందంలో కార్మికులకు నష్టదాయకమైనవి భావించినప్పుడు పోరాటంతో ఒప్పందాన్ని తిరగరాయించిన చరిత్ర తమకు ఉందన్నారు. కార్మికులకు నష్టదాయకమైన వేతన ఒప్పందాల్లో సంతకాలు చేసిన చరిత్ర హెచ్‌ఎంఎస్‌దన్నారు. నాయకులు మేదరి సారయ్య, మెండె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీ–2 జీఎం ఆఫీస్ ఎదుట ధర్నా


జీఎంకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

గోదావరిఖని: ఆర్జీ–2 జీఎం కార్యాలయం ఎదుట బీఎంఎస్ నాయకులు బుధవారం ధర్నా నిర్వహించారు. గనుల్లో కార్మికుల రక్షణ నియమాలు, చట్టాలను కఠినంగా అమలు చేయాల్సిన జీఎంఎస్ వైఖరిని నిరసించారు. కార్యక్రమంలో బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, నాయకులు కుమారస్వామి, వేణుగోపాలరావు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్లో చేరండి

- కళాశాలల్లో చేరేందుకు దరఖాస్తుల ఆహ్వానం
- ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ


గర్రెపల్లి మోడల్ స్కూల్

సుల్తానాబాద్: కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలకు దీటుగా మోడల్ స్కూల్ పాఠశాలలు, కళాశాలలు విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తున్నారు. ప్రస్తుతం వీటిలో ఇంటర్ ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. జిల్లాలోని గర్రెపల్లి, ఓదెల, కాల్వశ్రీరాంపూర్, జూలపల్లి, రామగుండం, ధర్మారం, ముత్తారాం, మోడల్ స్కూల్ పాఠశాలలు అందుబాటులో ఉన్నాయి.

అందుబాటులో 1,120 సీట్లు..

జిల్లావ్యాప్తంగా 14 మండలాలు 266 జీపీలుండగా పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీలతో పాటు గోదావరిఖని కార్పొరేషన్ ఉంది. మోడల్ స్కూల్‌లో జూనియర్ కళాశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. దీంతో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో గ్రూపులో 40 సీట్లు, మొత్తం 1,120 సీట్లు ఉన్నాయి. ఈనెల 25 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులు. ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు.

చక్కటి బోధన..

నైపుణ్యం గల పీజీ టీచర్లు ఏటా ఉత్తమ బోధనతో సత్ఫలితాలు సాధిస్తున్నారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధవహిస్తున్నారు. ఇక్కడి విద్యార్థులు ఏటా ఎంసెట్‌లోనూ మంచి ర్యాంకులు సాధిస్తున్నారు.

ఉజ్వల భవిష్యత్‌కు దోహదం



ప్రస్తుతం మోడల్ స్కూల్‌తో పాటు జూనియర్ కళాశాలల్లో ఇంటర్‌లో ప్రవేశాలు నిర్వహిస్తున్నాం. ఆసక్తిగల విద్యార్థులు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఇక్కడ చదువుతో పాటు ఆటల్లోనూ శిక్షణ ఇస్తున్నాం విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుంది. లోకల్ విద్యార్థులకు ప్రాధాన్యత కలదు.

– రాంబాబు, ప్రిన్సిపాల్, మోడల్ స్కూల్, గర్రెపల్లి

బాలికలకు వసతిగృహం

బాలికలకు వసతి గృహాలున్నాయి. ఇందులో వందమందిని చేర్చుకునే అవకాశం ఉంటుంది. గ్రామీణ, పేద విద్యార్థులకు మంచి అవకాశం. ఉచిత భోజనం, వసతితో పాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు రిజర్వేషన్ సౌకర్యం ఉంది.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం


ఆత్మీయసమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కాల్వశ్రీరాంపూర్: మూడున్నర దశాబ్దాల కిందట చదివిన విద్యార్థులకు, విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు కాల్వశ్రీరాంపూర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్ వేదికైంది. స్థానిక జెడ్పీహైస్కూల్లో 1987–88 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థులు విద్యనేర్పిన గురువులకు శాలువాలు కప్పి సన్మానించి జ్ఞాపికలు అందించారు. 35ఏళ్ల కిందట తాము చదివిన స్కూల్లో చేసిన అల్లరి పనులు గుర్తుచేసుకున్నారు. ఒకరినొకరు పలకరించుకుని ఆలింగనం చేసుకున్నారు. చిన్నపిల్లల్లా ఆడిపాడారు. అందరూ కలిసి భోజనంచేశారు. గ్రూఫ్ పోటోలు, సెల్ఫీలు దిగి సంబురపడ్డారు. గురువులు రిటైర్డ్ టీచర్లు విష్ణు శర్మ, గోలి మల్లయ్య, ఉమాపతి రాజు, సంపత్‌కుమార్, పీవీ. రాజిరెడ్డి, మాధవరెడ్డి, సత్యనారాయణ, రవీందర్‌రెడ్డి, స్వామిదాస్, ఈశ్వర్, పూర్వ విద్యార్థులు సింగిల్‌విండో చైర్మన్ రాంచంద్రారెడ్డి, డైరెక్టర్ నరసింహారెడ్డి, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మధుకర్‌రావు, పైడి రాజన్న, కందుల సదానందం, హేమలత, సుష్మ, లావణ్య పాల్గొన్నారు.

రవికుమార్ గౌడ్‌కు సన్మానం


రవికుమార్‌ను సన్మానిస్తున్న గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంజిగౌడ్

సుల్తానాబాద్: సర్దార్ సర్వాయిపాపన్న మోకుదెబ్బ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రఅధ్యక్షుడు అంజిగౌడ్ గీత పారిశ్రామిక సంఘం కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్‌కు ఘనంగా స్వాగతం పలికారు. బుధవారం సుల్తానాబాద్‌కు వచ్చిన సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. సీఎం కేసీఆర్ గీత వృత్తిదారులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించడం అభినందనీయమన్నారు. ఈ అవకాశాన్ని గీత వృత్తిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు అంజిగౌడ్, జిల్లా అధ్యక్షుడు వేగోలం శంకర్‌గౌడ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లెర్ల శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు బండారి లక్ష్మణ్‌గౌడ్, మండల ఉపాధ్యక్షుడు గడ్డం అనిల్‌గౌడ్, నారాయణరావులపల్లి సర్పంచ్ వెంకటలక్ష్మి , అంజన్న గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి ఆత్మహత్యాయత్నం

- గోదావరి నదిలో దూకేందుకు యత్నం
- కాపాడిన రివర్ పోలీసులు
- కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబసభ్యులకు అప్పగింత

యైటింక్లయిన్‌కాలనీ: గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి గోదావరిబ్రిడ్జిపై నుంచి తన ఇద్దరు పిల్లలతో కలిసి గోదావరినదిలో దూకేందుకు ప్రయత్నించిందో తల్లి. ఈ సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఆ మహిళను రివర్ పోలీసులు అడ్డుకుని కాపాడారు. టూటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. సెంటనరీకాలనీకి చెందిన ఓ సింగరేణి కార్మికుడి భార్య కుటుంబకలహాలతో మనస్తాపానికి గురై తన ఇద్దరి పిల్లలతో కలసి గోదావరి బ్రిడ్జి వద్దకు చేరుకుంది. పిల్లలతోపాటు నదిలో దూకేందుకు ప్రయత్నించగా అక్కడే విధులు నిర్వర్తిస్తున్న రివర్ పోలీసులు గమనించి అడ్డుకున్నారు. సదరు మహిళకు కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబసభ్యులకు అప్పగించారు. టూటౌన్ సీఐ వేణుగోపాల్ మాట్లాడుతూ.. సమస్యలకు ఆత్మహత్యలు పరిష్కారం కావన్నారు. మహిళను కాపాడిన రివర్ పోలీసులను అభినందించారు.

ఘనంగా సుకృత, సుదర్శన హోమం


ఆలయంలో హోమం నిర్వహిస్తున్న నంబూద్రి గురుస్వామి

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీలోని శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో విగ్రహ పునఃప్రతిష్ఠాపనోత్సవం సందర్భంగా బుధవారం సుకృత హోమం, సుదర్శన హోమం, ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. శ్రీ సంజీవ్ నంబూద్రి గురుస్వామి ఆధ్వర్యంలో కేరళ వాయిద్యాలు, కేరళ సాంప్రదాయ పద్ధతిలో ఉదయం 5 గంటలకు అష్టద్రవ్య మహా గణపతి హోమం, అంకురార్పణ పూజ, సుకృత హోమం, మృత్యుంజయ హోమం, వాస్తు హోమం, మహా సుదర్శన హోమం తదితర ప్రత్యేక పూజలు చేశారు. గురువారం సాయంత్రం శ్రీఅయ్యప్ప స్వామి మూల విరాట్ శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు ఆలయకమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ ప్రధాన గురుస్వామి శ్రీ అద్దంకి సారంగచారి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అయ్యప్పస్వామి దీక్షాపరులు, భక్తులు పాల్గొన్నారు.

హెల్ప్‌లైన్‌కు ఫోన్‌చేస్తే సమాధానమేదీ?

రామగుండం: కొనుగోలు కేంద్రాల్లో రైతులు పడుతున్న ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించుకునేందుకు ప్రభుత్వం ఏర్పాటుచేసిన హెల్ప్‌లైన్ 1800 425 00333కు కాల్ చేస్తే అధికారులు స్పందించడం లేదంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతర్గాం మండల పరిధిలోని ముర్మూరు గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో తూకం వేసేటప్పుడు తప్ప, తాలు పేరుతో కోత పెడుతున్నారని హెల్ప్‌లైన్‌కు కాల్ చేశాడు. స్పందించిన అధికారులు పెద్దపల్లి డీఎస్‌ఓకు ఫోన్‌చేయాలని సూచించారు. దీంతో రైతు శ్రీనివాస్ డీఎస్‌ఓకు కాల్‌చేస్తే స్పందన లేదని ఆవేదన వ్యక్తంచేశాడు. పెద్దపల్లి డీఎస్‌ఓ స్పందిచడం లేదంటూ హెల్ప్‌లైన్‌కు కాల్‌చేస్తే మరో అధికారి నంబర్ ఇచ్చారని దానికి కాల్‌చేసినా ఏలాంటి స్పందన లేదన్నాడు. ప్రభుత్వం ప్రకటించే హెల్ప్‌లైన్ నంబర్లు కేవలం రైతులను సంతృప్తిపరచడానికే తప్పా రైతు సమస్యలను పరిష్కారించేవారు లేకుండా పోయారని రైతు శ్రీనివాస్ ఆవేదన వ్యక్తంచేశాడు.

జీడీకే–2ఏ గనిని సందర్శించిన ఆర్‌అండ్‌డీ జీఎం


మ్యాప్‌పరిశీలిస్తున్న జీఎం సుభాని

గోదావరిఖని: జీడీకే–2ఏ గనిని కార్పొరేట్ ఆర్‌అండ్‌డీ జీఎం సుభాని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సుందిళ్ల ట్యాంక్ కిందనున్న జీడీకే 2, 2ఏ గని పిల్లర్స్ స్థిరత్వంపై శాస్త్రీయ అధ్యయనం, సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులను మోసం చేశారు


మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: కాంట్రాక్టు కార్మికులను వేజ్‌బోర్డు సంఘాలు మోసం చేశాయని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు తోకల రమేష్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక పవర్‌హౌజ్‌కాలనీలో గేట్‌మీటింగ్ ఏర్పాటుచేసి మాట్లాడారు. బొగ్గు పరిశ్రమలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు వేతన ఒప్పందాలు వర్తింపజేయాలని ఏన్నో ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నప్పటికీ వేజ్‌బోర్డు సంఘాలు పట్టించుకోవడం లేదన్నారు. 2013లో చేసిన హైపవర్ కమిటీ ఒప్పందాలను సైతం సింగరేణి అమలుచేయలేదన్నారు. రాంబాబు, ప్రసాద్, దీక్షకుమారి పాల్గొన్నారు.

పర్యావరణ ప్రతిజ్ఞ

గోదావరిఖని: ఆర్జీ–2 జీఎం కార్యాలయంలో పర్యావరణ ప్రతిజ్ఞ చేశారు. జీఎం మనోహర్, అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంట్ సైంటిస్ట్ కనకజ్యోతి, ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్, ఎస్‌ఓటూ జీఎం అబ్దుల్‌సలీం, డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రూట్‌కాస్ అనాలసిస్ శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

- ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్



సమావేశంలో మాట్లాడుతున్న జీఎం ఎ.మనోహర్

గోదావరిఖని: రూట్‌కాస్ అనాలసిస్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ కోరారు. బుధవారం సింగరేణి స్థాయి ఏజెంట్లు, ఏరియా రక్షణ అధికారులు, డిప్యూటీ మేనేజర్లకు విద్యుత్ సేఫ్టీ అధికారులకు, ప్రమాదాలకు గల కారణాలపై నిర్వహిస్తున్న రెండురోజుల శిక్షణ తరగతులను ప్రారంభించి మాట్లాడారు. బొగ్గు మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు శిక్షణ తరగతులు మూడు బ్యాచ్‌లుగా విభజించి శిక్షణ అందిస్తున్నామన్నారు. రూట్‌కాస్ అనాలసిస్ ద్వారా సింగరేణిలోని అన్నిగనులు డిపార్ట్‌మెంట్లలో ప్రమాదాలను విశ్లేషించి నివారణ చర్యలు తీసుకునేందుకు అవగాహన కలుగుతుందన్నారు. ప్రమాదం ఎందువల్ల జరిగింది. దానికి గల కారణాలు, భవిష్యత్‌లో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను విశ్లేషించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎంటీ డీజీఎం ఏకేకే శర్మ, ఎస్‌ఓఎం విజయ్‌కుమార్ అన్ని ఏరియాల అధికారులు పాల్గొన్నారు.

రెండోరోజూ రైస్‌మిల్లులపై టాస్క్‌ఫోర్స్ తనిఖీలు


రికార్డులను పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారి ఓఎస్‌డి ప్రభాకర్

సుల్తానాబాద్‌రూరల్: నాణ్యత పేరుతో మిల్లర్లు మోసం చేస్తున్నారన్న రైతుల ఫిర్యాదు మేరకు సుల్తానాబాద్ మండలం పరిధిలోని రైస్‌మిల్లుల్లో రెండురోజులుగా సివిల్ సప్లయ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు చేపడుతున్నారు. బుధవారం కాట్నపల్లి శివారులోని ఓ రైస్‌మిల్‌లో తనిఖీలు చేశారు. టాస్క్‌ఫోర్స్ అడిషనల్ ఎస్పీ ప్రభాకర్ మాట్లాడుతూ తూకాల్లో మోసాలు, కేంద్రాల నుంచి మిల్లులకు పంపించే ధాన్యం ఆలస్యంపై పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. మంథని మండలం నాగారం కొనుగోలు కేంద్రం నుంచి పంపిన ధాన్యానికి సంబంధించి రైతులపై రెండు ట్రక్‌షీట్‌లు ఉన్నట్లు గమనించామని పేర్కొన్నారు. మొదటి ట్రక్‌షీట్‌లో 528బస్తాలని ఉండగా.. రెండోట్రక్‌షీట్‌లో 518 బస్తాలే ఉన్నట్లు గుర్తించామన్నారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ ఎస్సైలు జంగయ్య, కృష్ణ, వెంకటేశ్వర్లు, సివిల్ సప్లయ్ అధికారి రవీందర్ ఉన్నారు.

27న కేశోరాం కార్మికులకు న్యాయ విజ్ఞాన సదస్సు

పెద్దపల్లిరూరల్: బసంత్‌నగర్‌లోని కేశోరాం సిమెంట్ వర్కర్స్ క్లబ్ ఆవరణలో ఈనెల 27న సాయంత్రం 4గంటలకు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్నట్లు పెద్దపల్లి సీనియర్ సివిల్ జడ్జి అర్జున్ తెలిపారు. కర్మాగారంలో పనిచేస్తున్న కార్మికులు వారి హక్కులు, సమస్యలకు చట్ట ప్రకారం పరిష్కారం, న్యాయ సలహాలను వివరిస్తామన్నారు.